సాక్షి
ప్రకాశం
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



దేవునితో పంతమేంటి స్వామీ..

రాజకీయ కక్షసాధింపులో భాగంగా పొన్నలూరు మండలం చౌటపాలెంలో వినాయక విగ్రహం నాలుగు రోజులుగా నిమజ్జనానికి నోచుకోలేదు. - 8లో..



పచ్చచొక్కాలకు ఇసుక విందు

జిల్లాలో ఇసుక కొరత అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. టీడీపీ నాయకులు యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా సాగిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37.5/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు.

ఎన్నికల ప్రచారంలో ఏప్రిల్ 1వ తేదీ మార్కాపురంలో, మే 4వ తేదీ పొదిలి సభలో చంద్రబాబు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లాను చేసి యువతకు ఉద్యోగాలిస్తానని హామీలిచ్చారు



అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పరిశ్రమలు స్థాపించి ఒకే ప్రకటనతో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని మే 1వ తేదీ ఒంగోలులో యువగళం సభలో చెప్పిన నారా లోకేష్



మే 4వ తేదీ గిద్దలూరు సభలో కూటమి ప్రభుత్వం రాగానే వెలిగొండ ప్రాజెక్టు నీటితో నింపుతామన్న పవన్ కళ్యాణ్



మహిళలకు (1500)

లబ్ధిదారులు
7,00,012

చెల్లించాల్సిన మొత్తం
రూ. 1,05,00,18,000

మహిళలు రూ.1500 కోసం ఎదురుచూస్తున్నారు



ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజలను మోసం చేయకుండా మాట నిలుపుకోవాలి. ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్‌సిక్స్ గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఒకలా, ఎన్నికల తరువాత మరొకలా మాట్లాడటం సరి కాదు. మహిళలు రూ.1500 ఎప్పుడిస్తారని ఎదురు చూస్తున్నారు.

– ఎం.అంజలి, పొదిలి

సూపర్ సిక్స్..
మోసం ఫిక్స్



ఆయన పద్నాలుగేళ్ల సీఎం.. పదిహేనేళ్ల ప్రతిపక్ష నేత. రాష్ట్ర రాబడి, వ్యయాలపై అంచనాలు ఉన్న ప్రజాప్రతినిధి. అధికారం కోసం ఎన్ని అడ్డదారులు తొక్కడానికైనా.. ఎవరినైనా తొక్కేయడానికి వెనుకాడని నైజం. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం చిమ్మారు. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. సూపర్ సిక్స్ అంటూ, సంపద సృష్టిస్తానంటూ బీరాలు పలికారు. అధికారం చేజిక్కగానే మంత్రులతో రోడ్ మ్యాప్ అంటూ గ్యాప్ తీసుకుంటున్నాడు. గతంలో ఇదే తరహాలో అలవికాని హామీలిచ్చి.. చివరకు లోటు బడ్జెట్ రాష్ట్రం అంటూ పథకాలను అటకెక్కించారు. ఇప్పుడూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ భయమేస్తోందంటూ విభ్రాంతి వ్యక్తం చేస్తూ.. జనాన్ని భ్రాంతిలో పడేశారు. మూడు పార్టీలు కలిసినా.. ఆరు పథకాలు అమలు చేయలేక కుంటి సాకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా ఇంత వరకు సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రూ.వంద కోట్ల ఖజానా అప్పగించినా.. ఒక్కడే తొమ్మిది (నవరత్నాలు) పథకాలకు మించి సంక్షేమాన్ని అందించారు. కరోనా కష్టకాలంలోనూ సాకులు చెప్పలేదు. అందరికీ అండగా నిలిచారు.

- ఈ ఏడాదికి పథకాల అమలు లేనట్టే
- రోడ్ మ్యాప్ అంటూ మంత్రుల ప్రకటన
- ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామంటూ చంద్రబాబు ప్రచారం
- గెలిచాక.. భయమేస్తోందంటూ వెనకడుగు
- నవరత్నాలతో ఐదేళ్లూ జనానికి అండగా నిలిచిన జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎన్నికల వేళ సూపర్ సిక్స్ అంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీల వర్షం కురిపించారు. ఆయనతోపాటు బీజేపీ, జనసేన నేతలు, ఎన్నికల రంగంలో నిలిచిన అభ్యర్థులందరూ సూపర్ సిక్స్‌పై విస్తృతంగా ప్రచారం చేశారు. ఒక ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామని నమ్మబలికారు. నీకు రూ. 15 వేలు..నీకు రూ. 15 వేలు, నీకు రూ. 15 వేలు అంటూ హామీలిచ్చేశారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చేశారు. పథకానికి సంబంధించి 2,89,783 మందికి రూ.434,67,40,000 చెల్లించాల్సి వస్తుంది. యువతకు ఉపాధి, లేదంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామంటూ ఆశలు కల్పించారు. ఉద్యోగం రాకపోయినా భృతి వస్తుందనుకుంటే అది ఎప్పుడు అమలుకు నోచుకుంటుందో తెలియని పరిస్థితి. చంద్రబాబును నమ్మిన నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.08 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.62.51 కోట్లు చెల్లించాల్సి ఉంది. దాదాపు 6.44 లక్షల మందికి గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది. దీనిపై అసెంబ్లీలో నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటనతో గ్యాస్ సిలిండర్ల కథ అంతేనా అంటూ మహిళలు నిట్టూరుస్తున్నారు. రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ ద్వారా ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. సుమారు 2.96 లక్షల మంది రైతులకు రూ.593,77, 80,000 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. పంటలు సాగుచేయాల్సిన సమయం వచ్చేసింది. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. అంతేకాకుండా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, సున్నా వడ్డీ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయి ఉండేవని ప్రజల్లో చర్చ జరుగుతోంది. అలాగే రైతు భరోసా నిధులు కూడా ఇప్పటికే తమ ఖాతాల్లో జమయ్యేదని అన్నదాతలు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 2.84 లక్షల మంది రైతులకు రూ.1634.85 కోట్లు చెల్లించింది. అలాగే అమ్మఒడి పథకం కింద 2,09,776 మందికి రూ.1249.47 కోట్లు జమచేసింది.

అన్నదాత సుఖీభవ

లబ్ధిదారులు
2,96,889

చెల్లించాల్సిన మొత్తం
రూ. 593,77,80,000

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



నాకు రెండున్నర ఎకరాలు పొలం ఉంది. కంది వేయాలనుకుంటున్నాను. పంటల అదును వచ్చింది. గత ప్రభుత్వంలో ఈ పాటికే రైతు భరోసా పథకం అందజేశారు. పంట ఖర్చులకు వచ్చేవి. చంద్రబాబు రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఆ డబ్బులు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు డబ్బులు ఇస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. సీజన్ అయిపోయిన తరువాత డబ్బులు వేస్తే పంటలు వేసేందుకు అప్పులు చేయాల్సి వస్తుంది.

– పేరం నాగార్జున రెడ్డి రైతు, ఎర్రోబనపల్లి, దర్శి మండలం

సంక్షేమ బావుటా



మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. ఏ పథకం ఎప్పుడిస్తారో చెబుతూ తేదీల వారీగా క్యాలెండర్‌ను ప్రకటించి సంక్షేమాభివృద్ధిని కాంక్షించిన చరిత్ర వైఎస్ జగన్‌ది. కులమతాలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా సంక్షేమ పథకాలను అర్హుల గుమ్మం ముందుకే చేర్చి దేశానికే ఆదర్శంగా నిలిచారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు డీబీటీ పథకాల రూపంలో రూ.12,410.20 కోట్లు, నాన్ డీబీటీ పథకాల రూపంలో రూ.3,732.59 కోట్లు అందించి నవ చరిత్ర లిఖించారు.

జగన్ హయాంలో లబ్ధిదారుల ఖాతాలకే ..

సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా నిధులు జమ చేయడం ద్వారా దళారీ వ్యవస్థకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెక్ పెట్టారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ), నాన్ డీబీటీ కింద లబ్ధిదారులకు నిధుల బదిలీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగింది. తద్వారా నిరుపేదలకు నవరత్నాలు పథకాలు చేరువయ్యాయి. గడిచిన ఐదేళ్లలో 17 సంక్షేమ పథకాల కింద రూ.17,934.65 కోట్లను నేరుగా పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించి అండగా నిలిచింది.

తల్లికి వందనం

లబ్ధిదారులు
2,89,783

చెల్లించాల్సిన మొత్తం
రూ. 434,67,40,000


తల్లికి వందనం వస్తుందో రాదో అర్థంకావడం లేదు



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు 4వ తరగతి, మరొకరు 2 వ తరగతి పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి జూన్ నెలలోనే రావడంతో ఇబ్బంది లేకుండా ఫీజు కట్టాం. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు దాటినా తల్లికి వందనం వస్తుందో.. రాదో తెలియడం లేదు. తల్లికి వందనం పథకం కింద ఇద్దరికీ రూ.15 వేల చొప్పున రూ.30 వేలు వస్తే ఫీజుల బాధ తగ్గుతుంది.

– బి.నాగమణి, మార్కాపురం

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రజలకు నేరుగా డీబీటీ పద్ధతిలో అందించిన పథకాలు ఇవీ...



వైఎస్సార్ మత్స్యకార భరోసా
మే 2023
లబ్ధిదారులు: 5,303 మంది
జమ: రూ.53.8 కోట్లు

వైఎస్సార్ వాహన మిత్ర
సెప్టెంబర్ 2023
లబ్ధిదారులు: 10,741 మంది
జమ: రూ.10.74 కోట్లు

అమ్మ ఒడి
జూన్ 2023
లబ్ధిదారులు: 2.4 లక్షల మంది
జమ: రూ.306 కోట్లు

కళ్యాణమస్తు
సెప్టెంబర్ 2023
లబ్ధిదారులు: 416 మంది
జమ: రూ.3.44 కోట్లు

వసతి దీవెన
మార్చి 2023
లబ్ధిదారులు: 42,409 (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ)
జమ : రూ.41.17 కోట్లు

సున్నా వడ్డీ
జూలై 2023
గ్రూపులు: 49,068
జమ: రూ.65.33 కోట్లు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
2023-24 సంవత్సరంలో
లబ్ధిదారులు: 50,601 మంది
జమ: రూ.119.71 కోట్లు

విద్యా దీవెన
ఏప్రిల్ 2023
లబ్ధిదారులు: 44,359 (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ)
జమ: రూ.34.29 కోట్లు

వైఎస్సార్ నేతన్న నేస్తం
ఆగస్టు 2023లో
లబ్ధిదారులు: 783 మంది
జమ: రూ.1.88 కోట్లు

వైఎస్సార్ ఆసరా ..
జనవరి 2024
డ్వాక్రా గ్రూపులు: 58,006
జమ: రూ.325.52 కోట్లు

రైతు భరోసా..
ఫిబ్రవరి 2024:
రైతులు: 2.84 లక్షలు
జమ: రూ.213 కోట్లు

వైఎస్సార్ చేయూత
ఫిబ్రవరి: 2024
లబ్ధిదారులు: 82,724 మంది
జమ: రూ.155.108 కోట్లు

అమ్మఒడి క్రమం తప్పకుండా ఇచ్చారు



మా పాప పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ లో 7వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన పని లేకుండా క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వచ్చేవి. ఈ ఏడాది తల్లికి వందనం పేరుతో డబ్బులు వేస్తానన్న ప్రభుత్వం ఇంకా దానికి సంబంధించి ఏమీ చెప్పలేదు. ఈఏడాది డబ్బులు పడతాయో లేదో అర్థం కాని పరిస్థితి. ప్రైవేట్ స్కూల్స్ అప్పుడే ఫీజులు కట్టమని అడుగుతున్నారు. వెంటనే డబ్బులు వేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– అవ్వారి రాజ్యలక్ష్మి, కందులాపురం, కంభం మండలం

రైతు భరోసా ఎంతగానో ఉపయోగపడింది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 ఇచ్చారు. రైతులకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉండేది. రైతు భరోసా కేంద్రాలు కూడా రైతులకు ఎంతో ఉపయోగపడ్డాయి. అంతకన్నా ప్రతి పథకం ఎక్కువ ఇస్తానని, రైతుకు పెట్టుబడిసాయం కింద రూ.20 వేలు అందిస్తామని చంద్రబాబు చెప్పారు. కానీ ఖరీఫ్ మొదలైనా ఇవ్వకపోవటంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

– రమణా రెడ్డి, రైతు, ఆర్‌వీపాలెం, తాళ్లూరు మండలం

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉపయోగపడింది



గత ప్రభుత్వంలో నాకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో ఉపయోగపడింది. ఇంజినీరింగ్ విద్య లక్షలతో కూడుకుంది. మధ్య, పేద తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సాధ్యమైంది.

– జే శివశంకరాచారి, బీటెక్ విద్యార్థి, మార్కాపురం

నిరుద్యోగ భృతి

లబ్ధిదారులు
2,08,350

చెల్లించాల్సిన మొత్తం
రూ. 62,50,50,000

నిరుద్యోగ భృతిపై మాట నిలబెట్టుకోవాలి



ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం చంద్రబాబు నాయుడు 2014లో కూడా ఇలానే చెప్పాడు. అది నెరవేర్చలేదు. 2024 ఎన్నికల సమయంలో కూడా మళ్లీ చెప్పాడు. ఇప్పు డేమో సంవత్సరం పడుతుంది, డేటా కావాలి అంటూ చెప్పుకొస్తున్నారు. అసలు చంద్రబాబుకి చిత్తశుద్ధి లేదు, మాట మీద నిలబడే వ్యక్తిత్వం కాదు. ఇలాంటి వారిని నమ్మకూడదు. నిరుద్యోగ భృతిపై మాట నిలబెట్టుకుని ప్రతినెలా రూ.3 వేల భృతి ఇవ్వాలి.

– ముప్పరాజు నాగరాజు, పొందూరు గ్రామం, టంగుటూరు మండలం

మూడు గ్యాస్ సిలిండర్లు

లబ్ధిదారులు
6,44,126

మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి..



అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కుదరదని చెప్పడంతో చంద్రబాబును నమ్మి మళ్లీ మోసపోయామని తెలుసుకున్నాం. అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు దొంగమాటలు చెప్పి మమ్మల్ని వంచించాడు. వెంటనే ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయాలి.

– పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, పెదయిర్లపాడు, పీసీపల్లి మండలం

ఉచిత బస్సు ప్రయాణం

లబ్ధిదారులు
11,02,821

మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేయాలి



మేము అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని కూటమి నాయకులు వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడంలేదు. అధికారం కోసం చేసిన హామీలన్నీ గాలికి వదిలేశారు. ఏ ముఖం పెట్టుకొని ప్రజల మధ్య తిరుగుతారు. వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలి.

– గంట వీరమ్మ, ఐనముక్కల, పెద్దదోర్నాల మండలం

క్లుప్తంగా

ఫుట్‌బాల్, సెపక్ తక్రా జట్ల ఎంపిక



ఎంపిక చేసిన ఫుట్‌బాల్, సెపక్ తక్రా జిల్లా జట్లు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ ఫెడరేషన్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) అండర్- 19 బాలికల ఫుట్‌బాల్, సెపక్ తక్రా జిల్లా జట్లను బుధవారం మధ్యాహ్నం స్థానిక ఏబీఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేశారు. పోటీల్లో 40 మంది బాలబాలికలు పాల్గొనగా ప్రతిభ ఆధారంగా తుది జట్టును ఖరారు చేశారు. ఎంపికైన జట్లు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, జిల్లా కార్యదర్శి ఈ.చింపారెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలకు ఫిజికల్ డైరెక్టర్లు, ఏబీఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాణి తదితరులు పర్యవేక్షించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



బంగారు పతకం సాధించిన బండి రమ్య

టంగుటూరు: అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈ నెల 14, 15 తేదీల్లో అండర్-19 100 కేజీల విభాగంలో టంగుటూరు పంచాయతీ రావివారిపాలెం గ్రామానికి చెందిన బండి రమ్య బంగారు పతకం సాధించింది. రమ్యకు వరుసగా ఇది రెండో బంగారు పతకం. రమ్య జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రమ్యను ప్రిన్సిపాల్ ఎన్. ప్రవంతి, పీఈటీ టి.హెప్సీబా, జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ భక్తద్రువుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన వెంకటరెడ్డి

పుల్లలచెరువు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కందురు వెంకటరెడ్డి(59) కొంత కాలంగా తనకున్న 2 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, పంటలు సక్రమంగా పండకపోవడం, చేనులో బోర్లు వేయడంతో దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఏడాది కూడా వ్యవసాయం కలిసి రాదోమో అన్న బాధతో బుధవారం పొలం వెళ్లి గడ్డి మందుతాగి పడిపోవడంతో చుట్టుపక్కల వారు గమనించి వైద్యశాలకు తరలించే లోపే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఇన్‌చార్జి ఎస్సై పి. చౌడయ్య తెలిపారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పచ్చ చొక్కాలకు ఇసుక విందు!

- మార్కాపురం వద్ద గుండ్లకమ్మ నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా
- టీడీపీ నేత కనుసన్నల్లోనే ఇసుక దందా

మార్కాపురం రూరల్/సింగరాయకొండ/ కొత్తపట్నం: జిల్లాలో ఇసుక కొరత అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. స్టాక్ పాయింట్లలో ఇసుక లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన అధికార టీడీపీకి చెందిన కొందరు నేతలు యథేచ్ఛగా అక్రమ దందా సాగిస్తున్నారు. మార్కాపురం మండల పరిధిలోని గుండ్లకమ్మ నుంచి పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో ఇసుక తరలించి అధిక ధర విక్రయిస్తున్నారు. మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉండే ఒక టీడీపీ నేత కనుసన్నల్లో ఇసుక రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక మాఫియా టన్ను రూ.2 వేల నుంచి రూ.2200కు విక్రయిస్తోందంటే అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. ఇసుక తవ్వకాల వ్యవహారం అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జరుగుమల్లి మండలంలోని పాలేరు నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నా అధికార యంత్రాంగం నిద్ర నటిస్తోంది. అక్రమ బాగోతంపై ఆధారాలతో సహా సామాజిక మాధ్యమాల్లో వార్తలొస్తున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు కిమ్మనడం లేదు. జరుగుమల్లితో పాటు కనిగిరి, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో టన్ను ఇసుక ధర రూ.1700 నుంచి రూ.1900 మధ్య విక్రయిస్తున్నారు. ఒక్కో టన్నుపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కంటే రూ.600 వరకు అధికంగా వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల సొమ్మును పిండేస్తున్నారు. 'అధికారంలోకి రాక ముందు ఇసుక ఉచితమని హామీ ఇస్తే నమ్మాం. పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటుందని అనుకోలేదు' అని భవనాల యజమానులు ఘొల్లుమంటున్నారు.



కొత్తపట్నం స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ

4 ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

కొత్తపట్నం మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ అన్సారియా ఆదేశాలతో మంగళవారం అర్ధరాత్రి రాజుపాలెం శివారు వద్ద 3 ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ, మడనూరు వద్ద ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ బాబు తెలిపారు.

భవన నిర్మాణాలు బంద్

- జిల్లాలో 15 వేలకు పైగా నిలిచిన భవనాల పనులు
- రెండు నెలలుగా తీవ్రంగా వేధిస్తున్న ఇసుక కొరత

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ హయాంలో ఇసుక విధానంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు.. కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇసుక పాలసీని రూపొందించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. గడిచిన రెండు నెలలుగా టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జిల్లాలో భవన నిర్మాణ రంగాన్ని భారీ కుదుపునకు గురిచేసింది. వర్షా కాలంలో నిర్మాణ రంగానికి ఇబ్బంది తలెత్తకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఇసుక నిల్వ చేయగా.. అధికారం చేతికొచ్చిందన్న అహంకారంతో టీడీపీ నేతలు అడ్డగోలుగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒంగోలు, జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం ఒక్క టన్ను ఇసుక కూడా లేదు. కానీ వాగులు, తీర ప్రాంతాల్లో ఇసుకను టీడీపీ కూటమి నేతలు యథేచ్ఛగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. వర్షా కాలం ముగిశాకే ఇసుక అందిస్తామని ఇటీవల గనుల శాఖ ప్రధాన కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా చేసిన ప్రకటన భవనాల యజమానులతోపాటు నిర్మాణ రంగానికి అనుబంధంగా ఉన్న 36 రకాల కార్మికులను డోలాయమానంలోకి నెట్టింది. జిల్లాలో ఇసుక కొరత కారణంగా 90 శాతం మేర అంటే సుమారు 15 వేలకు పైగా భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో పనుల్లేక కూలీలు, ఇతర అనుబంధ రంగాల కార్మికులు విలవిల్లాడుతున్నారు. ఒక్క గిద్దలూరు మండలంలోనే 450కి పైగా భవనాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, చీమకుర్తి, పొదిలి తదితర ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇంటి నిర్మాణం కోసం, శ్లాబ్ వేసేందుకు ఇసుక లభ్యం కావడం లేదు. శ్లాబ్ దశలో రాడ్ బెండింగ్ పని సైతం పూర్తి చేసుకున్న వారు కూడా ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు నిర్మాణదారులు తెల్ల ఇసుక లేకపోవడంతో స్థానికంగా బ్లాక్‌లో ఎర్ర ఇసుక కొనుగోలు చేస్తున్నారు. ఎర్ర ఇసుక నాణ్యమైనది కాదని తెలిసినప్పటికీ పేదలు ఆ ఇసుకనే వాడుతున్నారు.



గిద్దలూరులో శ్లాబ్ దశలో నిలిచిన నిర్మాణం



ఎర్ర ఇసుక వాడుతున్న నిర్మాణదారుడు

కార్మికులకు ఉపాధి లేదు



కంభం రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

- ఇసుక కొరతపై ప్రభుత్వం స్పందించాలి
- ధర్నాలో సీఐటీయూ నేతల డిమాండ్

కంభం: గత కొన్ని నెలలుగా ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు విమర్శించారు. ఇసుక కొరతపై బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపి ర్యాలీలు నిర్వహించారు. కంభంలో రెవెన్యూ, సహాయక కార్మిక శాఖాధికారి కార్యాలయాల్లో డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఇసుక కొరతతో ఉపాధి కోల్పోయి కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంభం పట్టణంలో ఇసుక స్టాక్ పాయింట్ పెట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 1214ను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యకలాపాలను పునరుద్ధరించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్ క్లైయిమ్స్ నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ అన్వర్‌బాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బల్లారపు రోశయ్య, ప్రధాన కార్యదర్శి ఖాజావలి, కోశాధికారి నాగెళ్ల జర్మియా, కొత్తూరు, మహబూబ్ బాషా, సిద్దారెడ్డి, పిక్కిలి వెంకటేశ్వర్లు, అవారి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

దేవునితో పంతమేంటి స్వామి

- నాలుగు రోజులుగా వినాయక నిమజ్జనానికి ఆటంకాలు
- చౌటపాలెంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు
- 16 మందిపై కేసులు.. మరి కొంతమందిపై కేసులకు ప్రయత్నం
- రాజకీయ ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లిన ఎస్సై గిరిబాబు
- బంధువుల ట్రాక్టర్లు, బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- ఇంత జరుగుతున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న జిల్లా అధికారులు



చౌటపాలెంలో వర్షంలోనే వినాయకుడి బొమ్మ



వినాయక బొమ్మ నిమజ్జనానికి నోచుకోలేదని కన్నీటిపర్యంతమవుతున్న మహిళలు

పొన్నలూరు: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా చౌటపాలెంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని అడ్డుకున్న మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి నాలుగు రోజులైనా తన పట్టు వీడటం లేదు. పదే పదే పోలీసులకు ఫోన్ ద్వారా హుకుం జారీ చేస్తూ స్థానికంగా టీడీపీ నాయకులు చెప్పినట్లు వ్యవహరించాలని హెచ్చరిస్తున్నాడు. వినాయకుడి నిమజ్జనం విషయంలో మంత్రి స్వామి, పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నా అవేవీ మాకు పట్టవు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే వినాయకుడికి నవరాత్రులు పూజలు, పునస్కారాలు చేపట్టిన గ్రామస్తులు మంత్రి స్వామి, పోలీసులు వినాయక నిమజ్జనం జరగకుండా అడ్డుకోవడంతో గత ఆదివారం నుంచి నాలుగు రోజులుగా ఎలాంటి పూజలు, లేకుండా అలాగే రోడ్డు పక్కన ఉండిపోయారు. బుధవారం గ్రామంలో వర్షం పడటంతో వర్షంలో తడుస్తున్న వినాయకుడి బొమ్మ చూసిన గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. చౌటపాలెం వినాయక నిమజ్జనం విషయంలో గత నాలుగు రోజులుగా ఇంత వ్యవహారం జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులు అంతా తెలిసి కూడా పట్టీపట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

16 మందిపై కేసులు... మరికొందరిపై కూడా..

గ్రామంలోని వినాయక బొమ్మ నిమజ్జనానికి అనుమతులు ఇచ్చిన పోలీసులు ఆ తరువాత మంత్రి స్వామి చెప్పాడని నిమజ్జనాన్ని అడ్డుకున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని ఆదివారం రాత్రి పొన్నలూరు పోలీస్ స్టేషన్ ముందు ఓవీ రోడ్డుపై గ్రామస్తులు, మహిళలు ధర్నా చేసి నిరసన తెలిపారు. అయితే వారికి న్యాయం చేయని పోలీసులు వినాయక నిమజ్జనానికి అనుమతి ఇవ్వకుండా టీడీపీ నాయకులు చెప్పిన పేర్లు ప్రస్తావిస్తూ 16 మందిపై కేసులు బనాయించారు. అలాగే తమకు అనుకూలంగా మరోసారి మరికొందరిపై కేసులు పెట్టడానికి ఎఫ్ఐఆర్‌లో ఇతరులు అని కూడా నమోదు చేశారు. దీంతో పాటు గ్రామస్తుల పిలుపు మేరకు గ్రామానికి వచ్చిన వారి బంధువుల ట్రాక్టర్లు, బైక్‌లను సీజ్ చేసి బుధవారం పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో బంధువుల ట్రాక్టర్లు

ఒత్తిడిని తట్టుకోలేక.. సెలవుపై వెళ్లిన ఎస్సై

ఇదిఇలా ఉంటే చౌటపాలెం వినాయక బొమ్మ నిమజ్జన విషయంలో మంత్రి బాలవీరాంజనేయస్వామి, జిల్లా పోలీస్ అధికారి నుంచి తీవ్ర ఒత్తిళ్లు, హెచ్చరికలు పొందిన పొన్నలూరు ఎస్సై గిరిబాబు మంగళవారం రాత్రి సెలవు పెట్టి వెళ్లిపోయారు. వినాయక నిమజ్జనం విషయంలో రాజకీయ ఒత్తిళ్లతో తాము బాధ్యతలు, మానవత్వం మరిచి ప్రవర్తించామని కొందరి గ్రామస్తుల దగ్గర ఎస్సై గిరిబాబు వాపోయినట్లు సమాచారం. అలాగే చౌటపాలెం గ్రామస్తులకు న్యాయం చేయకపోయినా దేవుని నిమజ్జనం విషయంలో అన్యాయంగా కేసులు బనాయించడానికి మనసాక్షి ఒప్పుకోవడం లేదని, బాధ్యతాయుతమైన వృత్తిలో ఉండి మనసాక్షి చంపుకొని విధులు నిర్వర్తించలేనని అన్నట్లుగా సమాచారం. అయితే ఎస్సై గిరిబాబు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టి వెళ్లినట్లు అధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కారణమేమైనా ఈ సమయంలో ఎస్సై సెలవులపై వెళ్లడం చర్చనీయంగా మారింది.

పట్టీపట్టనట్లుగా జిల్లా అధికారులు...

వాస్తవంగా మంత్రి స్వామి, స్థానిక పోలీసులు పైశాచిక ఆనందంతో చౌటపాలెం గ్రామస్తులు వినాయక బొమ్మ నిమజ్జనం చేయలేక నాలుగు రోజులుగా మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఇన్నేళ్లుగా తమ గ్రామంలో ఇలాంటి సంఘటన జరగలేదని, మొదటి సారిగా వినాయక నిమజ్జనాన్ని మంత్రి స్వామి, పోలీసుల చేష్టలతో సకాలంలో చేయలేకపోయామని కన్నీటి పర్యంతమయ్యారు. నాలుగు రోజులుగా చౌటపాలెం లో ఇంత జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులు తమకు ఇవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిమజ్జనానికి నోచుకోని వినాయకుడి బొమ్మ నాలుగు రోజులుగా రోడ్డ పక్కన ఉంటే జిల్లా అధికారులు కనీసం స్పందించకపోవడం దారుణమని గ్రామస్తులు అంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు జిల్లా అధికారులు సైతం తలొగ్గి పట్టించుకోకపోవడం మంచిది కాదని సామాన్య ప్రజలు సైతం ఆరోపిస్తున్నారు.

గ్రామీణాభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: గ్రామీణాభివృద్ధికి అధికారులంతా కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. జెడ్పీ కార్యాలయంలో బుధవారం జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ మాధురి నిర్వహణలో నిర్వహించిన సమావేశానికి ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యంపై సమీక్షించారు. అదే విధంగా స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖల గురించి అధికారులతో మాట్లాడారు. సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండా అంశాలను సభ్యులతో చర్చించి ఆమోదించారు. మూడో స్థాయి సంఘానికి యన్నాబత్తిన అరుణ, ఐదో స్థాయి సంఘానికి మారెడ్డి అరుణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మహిళను కాల్చి పడేశారు!



పూర్తిగా కాలిపోయిన మహిళ మృతదేహం

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ మల్లెల వాగు చప్టా పక్కన చిల్ల చెట్లలో గుర్తు తెలియని మహిళ మృతదేహం బుధవారం బయట పడింది. ఎస్సై కె.విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు... దొనకొండ–దర్శి రహదారిలోని మల్లెల వాగు చప్టా పక్కన చిల్ల చెట్లలో పూర్తిగా కాలిపోయిన మహిళ మృతదేహం కనిపించింది. గంగదేవిపల్లి గ్రామానికి చెందిన వారు ఉదయం పొలం పనుల నిమిత్తం వెళ్లారు. వారికి పూర్తిగా కాలిన మహిళ మృతదేహం కనిపించడంతో వీఆర్‌ఓ శివకోటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు తమ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చి పెట్రోలు పోసి నిప్పు పెట్టారని, గుర్తుపట్టని విధంగా పూర్తిగా మహిళా శవం కాలిపోయింది. మృతదేహాన్ని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హర్షన్ పరిశీలించారు. ఒంగోలు క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆనవాళ్లు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన లక్ష్మీకాంత్

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన గడ్డం లక్ష్మీకాంత్(39) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. లక్ష్మీకాంత్ భార్య పదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. మద్యానికి బానిసైన లక్ష్మీకాంత్ ఇంట్లో ఎవరూ డబ్బు ఇవ్వడం లేదని, భార్య లేదని మనస్థాపానికి గురయ్యాడు. మద్యంలో పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థకు గురైన లక్ష్మీకాంత్‌ను కుటుంబ సభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఒత్తిళ్లకు తలొగ్గకుండా న్యాయాన్ని రక్షించండి



ఎస్పీ దామోదర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

- ఎస్పీ దామోదర్‌కు విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి సురేష్

సింగరాయకొండ: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా న్యాయబద్ధంగా వ్యవహరించినప్పుడే గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నలూరు మండలం చౌటపాలెం, వేంపాడు గ్రామాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనలపై ఎస్పీతో మాట్లాడారు. పొన్నలూరు మండలం వేంపాడులో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన స్వల్ప గొడవకు అధికార పక్షం ఫిర్యాదు చేస్తే వైఎస్సార్‌సీపీ వారిపై కేసులు నమోదు చేశారని, వాస్తవానికి అధికార పక్షం వారు రెచ్చగొట్టి తగాదాకు ఉసిగొల్పారని వివరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఫిర్యాదుచేసినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చౌటపాలెంలో వినాయక నిమజ్జనం విషయంలో ఆమోదయోగ్యమైన నిర్ణయం చెప్పాలని ఎస్పీ దామోదర్ మాజీ మంత్రి సురేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఇరువర్గాలతో మాట్లాడి సమన్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే తాము కూడా సహకరిస్తామన్నారు.

ఎరిక్షన్ ఆగ్రహించెన్.. ఖాకీల ఓవరాక్షన్!

- తాగునీటి ట్యాంకులో పురుగుల మందు కలిపిన ఘటనపై టీడీపీ నేతల మధ్య వివాదం
- పోలీసులకు సాక్ష్యం చెబుతావా అంటూ సొంత పార్టీ నాయకుడిపైనే పచ్చమూక దాడి
- గొడవ చేస్తున్నారని ఫోన్ చేసిన రమణారెడ్డిపై లాఠీ ఝుళిపించిన పోలీసులు
- ఫ్లెక్సీ వివాదం, నీళ్లలో విషం కలపడంపై నోరు మెదపొద్దని బెదిరించిన ఎస్సై



టీడీపీ నాయకుడు పోతిరెడ్డి రమణారెడ్డి

యర్రగొండపాలెం: తాగునీటి ట్యాంకర్‌లో విషం కలిపిన ఘటనపై సాక్ష్యం చెప్పేందుకు సిద్ధపడిన టీడీపీ నాయకుడిపై అదే పార్టీకి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడగా.. కాపాడాలని ఫోన్ చేసి వేడుకున్న బాధితుడికే పోలీసులు లాఠీ దెబ్బలు రుచి చూపారు. ప్రజలతోపాటు టీడీపీ వర్గీయులను సైతం విస్మయానికి గురిచేసిన ఈ ఘటన మంగళవారం రాత్రి యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పోతిరెడ్డి రమణారెడ్డి రెండు నెలలుగా తన సొంత ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్నాడు. ఆ ట్యాంకర్‌పై వైపాలెం టీడీపీ ముఖ్యనేత డాక్టర్ మన్నె రవీంద్ర ఫొటోతో పాటు రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని అతికించాడు. దీనిని జీర్ణించుకోలేని వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆ ట్యాంకర్‌పై తన ఫ్లెక్సీ ఏర్పాటు చేయించాలని పోలీసులను ఆదేశించాడు. ఎరిక్షన్ బాబు ఫొటో పెట్టకుంటే గ్రామంలో నీటి సరఫరా నిలిపేయాలని పోలీసులు హెచ్చరించగా రమణారెడ్డి ఒప్పుకోలేదు. ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో కొందరు టీడీపీ వర్గీయులు ట్యాంకర్‌పై ఫ్లెక్సీ చించివేయడంతో పాటు నీటిలో పురుగుల మందు కలిపారు. ఈ తతంగాన్ని టీడీపీ నేతలు పోతిరెడ్డి పోలిరెడ్డి, భాష్యం చెన్నారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గమనించి వారించడంతో అక్కడి నుంచి జారుకున్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రమణారెడ్డి సాక్షులను వెంటబెట్టుకుని వెళ్లగా రాజీపడాలని పోలీసులు ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో టీడీపీకి చెందిన మేడగం సుబ్బారెడ్డి, కైపు బ్రహ్మరెడ్డి, బాష్యం రమణారెడ్డి, మేడగం రామిరెడ్డి, నుసుం శ్రీనివాసరెడ్డి, బాష్యం వేమారెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు పెద్ద అంజిరెడ్డి తన ఇంటిపై దాడి చేసి గాయపరిచారని బాష్యం చెన్నారెడ్డి వాపోయారు. దాడి ఘటనపై పోలీసులకు ఫోన్ చేయగా ఎస్సై చౌడయ్య తన సిబ్బందితో వచ్చి లాఠీలతో తీవ్రంగా కొట్టారని ట్యాంకర్ యజమాని రమణారెడ్డి ఆరోపించారు. పురుగుల మందు కలిపిన నీటిని గ్రామంలో సరఫరా చేసి ఉంటే తన పరిస్థితి ఏమై ఉండేదని ప్రశ్నించారు. ఎరిక్షన్‌బాబు, పోలీసుల తీరుతోనే గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.



లాఠీ దెబ్బలు చూపిస్తున్న పోతిరెడ్డి రమణారెడ్డి

మెనూ చార్జీ పెంచాలి.. గ్యాస్ ధర దించాలి

- కలెక్టర్‌కు కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకుల వినతి

ఒంగోలు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ చార్జీలు పెంచాలని కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విన్నవించారు. ప్రస్తుతం ఇస్తున్న మెనూ చార్జీ సరిపోవడం లేదని, అలాగే తక్కువ ధరకే గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై బుధవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, కుకింగ్ ఏజెన్సీలతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులు పాఠశాలల్లో పెడుతున్న భోజనం ఇష్టంగానే తింటున్నారా లేదా అని అధికారులను ప్రశ్నించారు. మెనూ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఆహార పట్టికలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. సమీక్షలో డీఈఓ సుభద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకంపై సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

బళ్లారి-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి జిల్లాలో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్యాకేజీ-10, 11, 12, 13, 14 భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా, రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, ఎస్డీసీ వరకుమార్, అటవీ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓలు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఎన్ఎహెచ్ఏఐ పీడీ విద్యాసాగర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బుధవారం స్థానిక ప్రకాశం భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2024 ఆగస్టు 20వ తేదీ నాటికి ఓటు హక్కులేని వారు, 2025 జనవరి 1వ తేదీనాటికి 18 ఏళ్లు నిండేవారు నూతనంగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమీక్షలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలిక హాస్టల్ పరిశీలన

ఒంగోలు సెంట్రల్: చీమకుర్తిలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. రూ.2 కోట్ల డీఎంఎఫ్ నిధులతో నిర్మించనున్న అదనపు గదులకు సంబంధించి సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్, ఏఎస్‌డబ్ల్యుఓ దానయ్య, వార్డెన్ అరుణకు సూచనలిచ్చారు. చీమకుర్తిలో దెబ్బతిన్న కారుమంచి మేజర్‌ను, స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో పోస్ట్ మార్టం గది నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి, వైద్యులతో చర్చించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్